

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విహంగ వీక్షణం, అనుదీపాలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

విహంగ వీక్షణం పుస్తకావిష్కరణ

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రచనలు తనలోని వ్యక్తిత్వాన్ని బాహ్యప్రపంచానికి చాటి చెప్పాయని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ జెల్ది విద్యాధర్ రచించిన విహంగ వీక్షణం, శివవరపు అనురాధ రచించిన అనుదీపాలు పుస్తకావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో ఓర్పు నేర్పు అనేది మనలోని గొప్పతనాన్ని ప్రదర్శిస్తుందన్నారు. అమ్మ గురించి రాసిన వ్యాఖ్యలు మనస్సును హత్తుకున్నాయన్నారు. నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డా.రాధా కుసుమ, డా.విజయలక్ష్మి పండిట్, డా.మామిడాల శైలజ, తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ కోచ్ కృష్ణ

ప్రతి ఒక్కరూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి : కృష్ణ

ముషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తనను తాను రక్షించుకునేందుకు దోహదపడుతాయని తైక్వాండో హైదరాబాద్ అసోసియేషన్ బి.కృష్ణ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ సమీపంలోని స్వరాజ్ కమ్యూనిటీ హాల్‌లో తైక్వాండో హైదరాబాద్ జిల్లా 6వ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరూ తప్పనిసరి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. ఈ పోటీలలో 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో సీనియర్ కోచ్‌లు లక్ష్మీనారాయణ, స్వామి, రాకేష్, సంజయ్‌కుమార్, రఘు, తదితరులు పాల్గొన్నారు.



జాబేర్ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవి జి.లక్ష్మీనర్సయ్య

నేటి కాలానికి అవసరమైనది జాబేర్ కవిత్వం

ప్రముఖ కవి జి.లక్ష్మీనర్సయ్య


రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఇది గల్ఫ్ బతుకుల అవస్థ, పాషా రాసిన ప్రేమ కవిత్వం, ప్రకృతి కవిత్వం, యుద్ధంపై రాసిన కవిత్వం, మానవ సంబంధాల కవిత్వం, విప్లవోద్యమాలపై రాసిన కవిత్వం సమకాలీన ఘటనలపై రాసిన కవిత్వం నేటి కాలానికి అవసరమైనది జాబేర్ కవిత్వం అని ప్రముఖ కవి జి.లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన యువ కవి జాబేర్ పాషా కవితా సంపుటి 'అగరు దీపం కాదు పొగ' ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కానీ దేశంలో ఉంటూ కూడా కవిత్వం రాయడం, అందులో తనదైన బతుకు పరిమాళాన్ని పరిభాషను తీసుకురావడం గొప్ప విషయమన్నారు. కవి యాకుబ్ మాట్లాడుతూ కవి సంగం నుంచి ఇలాంటి మంచి పుస్తకం ప్రచురించడం ఆనందం కల్పిస్తుందన్నారు. ప్రముఖ కవయిత్రి నాంపల్లి సుజాత మాట్లాడుతూ తన విద్యార్థి నేడు ఒక కవిగా గుర్తింపు తెచ్చుకోవడం గురువుగా తనకు ఆనందం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో యువకవులు నాగిళ్ల రమేష్, గోపాల్, మోహన్‌కృష్ణ, జాబేర్ పాషా, కవులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ ఎల్ పద్మ

యువత శాస్త్రీయ దృష్టిని అలవర్చుకోవాలి

నల్లకుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మన చుట్టూ జరుగుతున్న సంఘటనలను యువతీ, యువకులు శాస్త్రీయ దృష్టితో చూడడం అలవర్చుకోవాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎల్.పద్మ అన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ప్రోగ్రెసివ్ యూత్ (పీవైఎల్) గ్రేటర్ హైదరాబాద్ జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యం, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు, అశ్లీల సంస్కృతిలో కూరుకుపోయేలా చేస్తున్న నేపథ్యంలో వీటి పట్ల ప్రగతిశీల యువకులు ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ప్రదీప్ నాయకులు ఎం.రవికుమార్, బి.ఎస్.కృష్ణ, కొల్లూరు భీమేష్, కిరణ్, ప్రకాష్, శంకర్, రవి, నరేందర్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



విరసం ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

విరసం ఆవిర్భావ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విరసం 55 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవ వేడుకల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. జూలై 6న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 55 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుగుతాయని విరసం నేతలు పేర్కొన్నారు. తొలి అధ్యక్షుడిగా కేవీఆర్‌తో ఏర్పడిన ఈ సంస్థ 55 ఏళ్లు పూర్తిచేసుకుందని తెలిపారు.

దిశా కమిటీ సభ్యుడు నర్సింహకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, తదితరులు

ముషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు, దిశా కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ బీజేపీ బలోపేతానికి ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధి పథకాల ప్రచారానికి చేస్తున్న కృషిని అభినందిస్తూ భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించి శాలువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోఠీకి వెళ్లాలా..

కోటి తిప్పలు పడాల్సిందే..!

గోల్నాక చౌరస్తాలో ప్రమాదకరంగా మారిన కుడి..ఎడమ మూలమలుపులు

- ఫ్లైఓవర్ ప్రారంభించి.. సర్వీసు రోడ్డును మరచిన అమాత్యులు
- కోఠీ, అఫ్జల్ గంజ్ వెళ్లాలంటే చుట్టూ తిరిగిపోవాల్సిందే
- ట్రాఫిక్ కష్టాలతో ఇబ్బందులపాలవుతున్న ప్రజలు



గోల్నాక చౌరస్తాలో ఇరుకుగా ఉన్న లెఫ్ట్, రైట్ మూలమలుపులు



గోల్నాక, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గోల్నాక చర్చి నుంచి అంబర్‌పేట ముక్రమ్ హోటల్ వరకు నిర్మించిన ఫ్లైఓవర్‌తో ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని అందరు భావించగా సమస్య ఇంకా జటిలమైంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కలిసి ఫ్లైఓవర్ ప్రారంభించి సర్వీసు రోడ్డును పునరుద్ధరించకుండా తమ పని అయిపోయిందని చేతులు దులుపుకున్నారు. గోల్నాక నుంచి అంబర్‌పేటకు వెళ్లే సర్వీసు రోడ్డు బంద్ ఉండడంతో గోల్నాక నుంచి అంబర్‌పేటకు వెళ్లేవారు.. అంబర్‌పేట నుంచి గోల్నాకకు వచ్చే వారు జిందా తిలిస్మాత్ గుండా చుట్టూ తిరిగి రావలసిన పరిస్థితి నెలకొంది. సమాధులు, మజీద్ అడ్డుగా రావడంతో సర్వీసు రోడ్డును పునరుద్ధరించకుండా దానిని పూర్తిగా మూసి వేసి ప్రజలను ఇబ్బందులపాలు చేయడం పాలకులకు తగునా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

- గోల్నాక చౌరస్తాలో రెండు మూల మలుపులైన కుడి, ఎడమ మూలమలుపులు ఇరుకుగా ఉండడం.. దీంతోపాటు పెరిగిన ట్రాఫిక్‌తో ప్రయాణికులు నిత్యం నరకమే చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనాలు ఈ మూల మలుపులలో టర్న్ అవుతున్న సమయంలో ట్రాఫిక్ స్తంభించి పోవడమే కాక ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి.
- మే నెలలో ఫ్లైఓవర్‌ను కేంద్రమంత్రులు రాష్ట్రమంత్రులు కలిసి ప్రారంభించారు కానీ ఇప్పటి వరకు సర్వీసు రోడ్డు విషయం పట్టించుకోవడంలేదు. ఉప్పల్‌నుంచి అంబర్‌పేట, ఛేనెంబర్, గోల్నాక చాదర్‌ఘాట్ గుండా కోఠికి వెళ్లే బస్సులు, అలాగే ఉప్పల్ నుంచి అంబర్‌పేట, ఛేనెంబర్, గోల్నాక, చాదర్‌ఘాట్ గుండా అఫ్జల్‌గంజ్, చార్మినార్‌కు వెళ్లే బస్సులు ఈ సర్వీసు రోడ్డు బంద్ ఉండడంతో అలీ కేఫ్ నుంచి తిరిగి రావలిసిన దుస్థితి ఉంది. ముఖ్యంగా ఈ సర్వీసు రోడ్డు బంద్ ఉండడంతో గోల్నాకలో ట్రాఫిక్ చక్రబంధంగా మారిపోయింది. గోల్నాక చౌరస్తా నుంచి కాచిగూడ కమేళా వరకు ట్రాఫిక్ స్తంభించి పోతుంది. ఈ చౌరస్తాలోని రెండు మూల మలుపులు కూడా ట్రాఫిక్‌తో దిగ్బంధంగా మారడంతో ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఈశ్వరమ్మ బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి : ముఠాగోపాల్



ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న బస్తీవాసులు

కవాడిగూడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ ఈశ్వరమ్మ బస్తీలో నెలకొన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. ఆదివారం ఎమ్మెల్యేను బీఆర్ఎస్ నాయకుడు చింతల హరీష్ యాదవ్ ఈశ్వరమ్మబస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దలతో కలిసి వినతి పత్రం అందజేశారు. హరీష్‌యాదవ్, బస్తీకమిటీ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, చైర్మన్ జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు. ఈశ్వరమ్మబస్తీలో ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాల వల్ల కరెంట్ స్తంభాలకు షాక్ తగిలి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా పైప్‌లైన్‌కోసం తవ్విన గోతులతో ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులతో కలిసి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముఠా జైసింహా, డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాసుల వినతి

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్‌లోని అపార్ట్‌మెంట్‌వాసుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ఆదివారం అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కడప సురేందర్ అధ్యక్షతన విద్యానగర్‌లోని సాహిమోహన్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌వాసుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, మంచి నీరు, కరెంట్, స్పీడ్ బ్రేకర్లు, కోతుల బెడద వంటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు.

అంబర్‌పేట అమ్మవారి బోనాలు వైభవంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న మహాకాళి ఆలయ సలహాదారు దుర్గాప్రసాద్‌రెడ్డి

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో అంబర్‌పేట మహాకాళి దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేట అమ్మవారి బోనాలు అందరి సహకారంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని సేవా సమితి అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, సలహాదారులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జరిగిన దేవస్థాన సేవా సమితి సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ యేడాది కూడా అంబర్‌పేటలో బోనాలను కనీవిని ఎరుగని రీతిలో చేస్తామన్నారు. ఈ వేడుకలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. బూర్జుగల్లీలోని శ్రీ హనుమాన్ దేవాలయం పునర్ నిర్మాణం చేపడతామన్నారు. పోచమ్మ బస్తీలో అమ్మవారి దేవాలయం పునర్ నిర్మాణానికి ఆలయానికి కావాల్సిన ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. గత యేడాది బోనాలు, దసరా, బోడ్రాయి పండగలకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలను కూడా వారు వివరించారు. ఆర్థిక లావాదేవీలపై అనుమానం ఉంటే ఆలయానికి వచ్చి నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో దేవస్థాన సేవా సమితి ఉపాధ్యక్షులు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బింగి మల్లికార్జున్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి డి.కిషోర్, కార్యదర్శి చెంగలి సుధాకర్, సలహాదారులు గడ్డం లక్ష్మణ్‌గౌడ్, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ గిరిధర్‌గౌడ్, పాండు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాపై కమలం జెండా ఎగరడం ఖాయం: వనం



నల్లకుంట బీజేపీ కార్యాలయంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షిస్తున్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నేతలు

నల్లకుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా బీజేపీ శ్రేణులు కృషి చేయాలని నల్లకుంట డివిజన్ మాజీ కార్పొరేటర్ వనం రమేష్ అన్నారు. తద్వారా రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బల్దియాపై కమలం జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నల్లకుంట బీజేపీ కార్యాలయంలో వనం రమేష్ ఆధ్వర్యంలో ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో బీజేపీ నేతలు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంపై నిరంతరం పార్టీశ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలయ్య, నరేష్, గణేష్, శ్రవణ్‌యాదవ్, ఈశ్వర్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి : రమేష్‌రాం



బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రాం

ముషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని చాకలి బస్తీలో బీజేపీ డివిజన్ కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్‌రాం మాట్లాడుతూ.. మోదీ 11 సంవత్సరాల పాలనలో దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి ప్రపంచంలో అగ్రగామి దేశంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రజా సంక్షేమానికి, చేతివృత్తుల పరిరక్షణకు బడ్జెట్‌లో పెద్దపీట వేసి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, బబ్లూ, దిశాకమిటీ సభ్యుడు నందగిరి నర్సింహం, నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ మహేష్ పాల్గొన్నారు.

ప్రధాని మన్‌కీబాత్

భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ ఆధ్వర్యంలో డివిజన్ పోలింగ్‌బూత్ నెంబర్ 138లో ప్రధాని మన్‌కీబాత్ నిర్వహించారు. మోదీ ప్రసంగాన్ని కార్యకర్తలు శ్రద్ధతో విన్నారు.



గజల్ హిందీ అనువాద గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌కామ్ టాక్స్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ చీఫ్ కమిషనర్ నరసింహప్ప, శ్రీనివాసరావు, తదితరులు

గజల్ హిందీ అనువాద గ్రంథావిష్కరణ

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్; భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ గజల్ కవయిత్రి డాక్టర్ విజయలక్ష్మి పండిట్ రాసిన గజల్ హిందీ అనువాద గ్రంథావిష్కరణ కార్యక్రమం ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగింది. ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌కామ్ టాక్స్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప, కవి మువ్వ శ్రీనివాసరావు తదితరులు హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ విజయలక్ష్మి పండిట్ రాసిన గజల్ హిందీ అనువాద గ్రంథం గజల్ ప్రియులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆమె చేసిన ఈ ప్రయత్నాన్ని వారు అభినందించారు. ఈ సందర్భంగా విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ జాతీయ జీవన సాఫల్య పురస్కారాలను విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ జాతీయ లీటరీ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురస్కార గ్రహీత డాక్టర్ అలూరి సుభాష్‌బాబు, భగీరథ, పి.సునందబాయి, డాక్టర్ ఎం.యశోదదేవి, విజయ, మల్లికార్జున్‌రావు, భువనేశ్వరీ, ఆత్మీయ అతిథులు విద్యాసాగర్, సూరారం శంకర్, రామ్‌శర్మ, మిరియాల రాధాకృష్ణ, క్రాంతికృష్ణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



లైబ్రరీ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సిటీ లైబ్రరీ వద్ద విస్తృత పోలీసు బందోబస్తు

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద ధర్నా చేస్తారన్న సమాచారంతో చిక్కడపల్లి పోలీసులు ఆదివారం విస్తృత పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నిరుద్యోగులు ధర్నా చేస్తారన్న సమాచారం రావడంతో పోలీసులు పెద్దఎత్తున లైబ్రరీ వద్దకు ఉదయమే చేరుకున్నారు. నిరుద్యోగులు ధర్నా చేస్తే వారిని అరెస్ట్ చేసి తరలించేందుకు రెండు వ్యాన్లు, కార్లు, సైతం తెచ్చి లైబ్రరీ ముందు ఉంచారు. దీంతో నిరుద్యోగులు ధర్నా చేయడానికి లైబ్రరీ వద్దకు రావడానికి సాహసించలేదు. సాయంత్రం వరకు పోలీసులు బందోబస్తు కొనసాగించారు.



ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో భాగయ్య, అంబటి సుధాకర్ తదితరులు

తొలగించిన ఆంధ్రా బీసీ కులాలను ఈ జాబితాలో చేర్చొద్దు

కవాడిగూడ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తొలగించిన ఆంధ్రప్రదేశ్‌లోని 27 బీసీ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చొద్దని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను ఆదివారం బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు భాగయ్య, సమితి రాష్ట్ర నాయకుడు అంబటి సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలగించిన బీసీ 27 కులాలను తెలంగాణ బీసీ కమిషన్‌లో చేర్చే ప్రయత్నం చేస్తోందని దీంతో తెలంగాణలోని బీసీకులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యను పార్లమెంటులో చర్చించాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు. దీనికి ఎంపీ రవిచంద్ర సానుకూలంగా స్పందిస్తూ ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తెలంగాణ బీసీ కులాలకు న్యాయం జరిగేవిధంగా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలల సత్తా చూపిస్తాం'

నల్లకుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వర్గీకరణతో దళితులను చీల్చిన పార్టీలకు త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలలు అన్ని స్థానాల్లో పోటీ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి గుణపాఠం చెప్పాలని మాల, మాల ఉపకులాలకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరగలేదని, కేవలం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రపూరితంగా చట్టం చేసిందని ఆరోపించారు. ఆధిపత్యం నిలుపుకోవడానికి కులాలను రాజ్యాంగ విరుద్ధంగా చీల్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మాలలు తగిన ప్రతీకారం తీర్చుకోవాలన్నారు.



ఉచిత వైద్యశిబిరంలో మహిళలకు మందులు పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి శబరి, వైద్య బృందం

ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నల్లకుంట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి వీ.కే.శబరి అన్నారు. ఆదివారం స్వాంతన చారిటబుల్ ట్రస్ట్, గద్దె రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట చెంచు సంక్షేమ సంఘం హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో కిమ్స్ ఆస్పత్రి జనరల్ ఫీజీషియన్, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్, గైనకాలజీ వైద్యులు 200 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షించి ఆరోగ్య సలహాలు ఇచ్చి మందులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శివరామకృష్ణ, వీహెచ్‌పీ నాయకులు రవికుమార్, శేఖర్, బీజేపీ నాయకులు క్యాంపు కో-ఆర్డినేటర్లు నర్సింగ్‌రావు, విక్రమ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'చానెల్'పై దాడి అమానుషం: సాయిబాబా

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మహాన్యూస్ చానెల్ ప్రధాన కార్యాలయంపై బీఆర్ఎస్ నేతల దాడి అమానుషమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం టీడీపీ నగర పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే కోర్టుకు వెళ్లాలి కానీ ఇలా దాడులు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరావు, వినోద్‌కుమార్ తెలిపారు. బౌద్ధనగర్, సెవెన్ టెంపుల్, తాజ్‌మహల్, కింగ్‌కోఠి పరిధుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, జామై ఉస్మానియా, హిందీ ప్రచారసభ, కలెక్టర్ ఆఫీస్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.